సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 19 । జులై । 2024



ఉచ్చు బిగించి..

అప్పు ఇవ్వలేదన్న అక్కసుతో మహిళ మెడకు టవల్‌తో ఉచ్చుబిగించి, ఆపై బండరాయితో మోది కర్కశంగా హత్యచేశారు. 8లో▸



బాలాజీ సన్నిధిలో..

సినీ నటుడు, దర్శకుడు విశ్వక్ సేన్ గురువారం కలియుగ దైవం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. 8లో▸



కమిటీలకు చెక్కులు

ప్రజల భాగస్వామ్యం, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 8లో▸

రేపు కొత్తూరు మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

కొత్తూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు

మున్సిపాలిటీ : కొత్తూరు

కమిషనర్ : ఎస్.బాలాజీ

తేదీ : 20-7-2024 (శనివారం)

సమయం : ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
98489 71375

న్యూస్‌రీల్

నేడు మీర్‌పేట డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డిప్యూటీ మేయర్‌పై గత నెల 24న బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖను అందజేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 11 గంటలకు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అవిశ్వాసం నెగ్గడానికి 31 మంది సభ్యులు అవసరం ఉండగా, బీజేపీకి 21 మంది, కాంగ్రెస్‌కు 11, బీఆర్‌ఎస్‌కు 14 మంది ఉన్నారు.

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: ఈఎంఆర్‌ఐ (108) సంస్థలో ఈఎంటీ ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ప్రోగ్రాం జిల్లా మేనేజర్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ చదివి 30 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20న సరూర్‌నగర్‌లోని 108 జిల్లా కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకుని రావాలన్నారు. ఇతర వివరాలకు 91007 99167 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

మొయినాబాద్: జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్‌ను మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఎక్స్‌పోలో జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్స్‌పోలో తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి మల్లేశ్, సభ్యులు విష్ణుగౌడ్, బాలు, రంజిత్‌గౌడ్, మహేష్, శ్రీశైలం, మాణిక్‌రెడ్డి, రవితేజ, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: సంబరాల్లో భాగంగా ఎడ్లబండిపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి



ఆమనగల్లు: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

49,741 మంది రైతులు

రూ. 278.6 కోట్లు

పకడ్బందీగా రుణమాఫీ పథకం అమలు చేస్తాం

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- జిల్లా కేంద్రం సహా అన్ని బ్యాంకుల్లోనూ హెల్ప్ డెస్క్‌లు
- సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక సమావేశం



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతురుణ మాఫీ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ శశాంక ప్రకటించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, సహకార, బ్యాంకర్లతో కలిసి రైతు రుణమాఫీపై తీసుకోవాల్సిన చర్యలపై, డీసీసీ-డీఎల్ ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు 12 డిసెంబర్ 2018, ఆ తరువాత మంజూరైన/రెన్యూవల్ అయిన రుణాలకు, 9 డిసెంబర్ 2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు వర్తిస్తుందని తెలిపారు. మొదటి విడత రూ.లక్ష వరకు, రెండో విడత రూ.1.50 లక్షల వరకు, మూడో విడత రూ.2 లక్షల వరకు దశలవారీగా రుణమాఫీ అవుతుందన్నారు.

సమస్యలుంటే సంప్రదించండి

జిల్లాలో 49,741 మంది రైతులకు లక్ష లోపు రుణ మాఫీ ద్వారా రూ.278.6 కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని బ్యాంకులు, సహకార శాఖ బ్యాంకులు, సహకార శాఖ సొసైటీల ద్వారా రైతులకు నేరుగా వారి ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమవుతుందని చెప్పారు. ప్రతి బ్యాంకుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా కేంద్రం వ్యవసాయ శాఖ కార్యాలయంలో, మండల స్పెషల్ ఆఫీసర్లను, నియోజక వర్గ స్పెషల్ ఆఫీసర్లను సంప్రదించేలా చర్యలు చేపట్టాలని అగ్రికల్చర్ అధికారులకు సూచించారు. రుణమాఫీ కోసం వచ్చే రైతులకు పూర్తిగా సహకరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకారశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఖరీఫ్, రబీకి సకాలంలో పంట రుణాలు చెల్లించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. రుణమాఫీ అంశంలో ఏదైనా సమస్య ఉంటే ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040-24547507 నంబర్‌లో సంప్రదించొచ్చని సూచించారు.

రైతులతో వీసీ ద్వారా ముచ్చటించిన సీఎం

ప్రభుత్వం అమలులోకి తెచ్చిన రైతు రుణ మాఫీ-2024 కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం రైతులతో మాట్లాడారు. జిల్లాకు చెందిన 12 మంది రైతులు మల్లపెద్ది చెన్నమ్మ, జర్పుల శంకర్, కె.మల్లయ్య, గొడుగు చెన్నయ్య, చింతకింది భిక్షపతి, బండి జగదాంబ, సబావత్ చందర్, ఎర్ర ఆండాలు, మరమోని యాదమ్మ, అర కోటం శారద, విఠ్యాల ఆండాలు, మల్లగారి మాణిక్యంరెడ్డికి సీఎం స్వయంగా రుణమాఫీ చెక్కులు అందజేశారు. శంషాబాద్ మండలం మల్కాపురం గ్రామంలోని మార్కెట్ కమిటీలో గల రైతు వేదిక నుంచి కలెక్టర్ శశాంక రైతులు, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గీత రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



తొలి విడతలోనే లక్ష రూపాయల రుణం మాఫీ కావడం ఆనందంగా ఉంది. సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకోవడం, ఆయనతో నేరుగా మాట్లాడడం మరవలేని జ్ఞాపకం. రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– మారమోని యాదమ్మ, మహిళా రైతు, తుమ్మలూరు, మహేశ్వరం

పహాణీల ట్యాంపరింగ్!

శంషాబాద్ హెచ్‌ఎండీఏ భూముల్లో భారీ అవకతవకలు

- కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల అండ..విచారణలో వెల్లడి
- అప్పటి రికార్డ్ అసిస్టెంట్, ప్రస్తుత అబ్దుల్లాపూర్‌మెట్ డీటీపై వేటు
- జూనియర్ అసిస్టెంట్ అజయ్, వీఆర్‌ఏ రవిపై కూడా..
- ప్రస్తుత తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు నోటీసులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కబ్జాదారులతో కుమ్మక్కై, సర్కారు భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు సహకరించిన ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై కలెక్టర్ వేటు వేశారు. అక్రమార్కులను కాపాడేందుకు రికార్డులను పరిశీలించకుండానే నివేదిక సమర్పించిన ముగ్గురు తహసీల్దార్లకు తాఖీదులు జారీ చేశారు. ఇదిలావుండగా, ఈ అవినీతిపర్వంలో తమ ప్రమేయం లేదని ఇప్పటికే వీరిలో కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

ట్యాంపరింగ్ చేసి.. ఏమార్చి

ఉమ్మడి ఏపీ హయాంలోనే ట్రక్ టెర్మినల్ నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏకి శంషాబాద్‌లోని 724, 725 సర్వే నంబర్లలో 214.02 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ మేరకు అప్పట్లోనే అవార్డు (నం. 1/1990, ఫైల్ నంబర్ ఐఏ84/86)ను కూడా జారీ చేసింది. సర్వే నం. 725/21లో 7.7 ఎకరాలు, సర్వే నంబర్ 725/23లోని 10.7 ఎకరాలు, సర్వే నం.725/24లోని 12.34 ఎకరాలతో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారు 50 ఎకరాల భూమిని తమ పూర్వీకులు 'పైగా అథారిటీ' నుంచి వేలంలో కొనుగోలు చేశారని పేర్కొంటూ ఫలక్‌నుమాకు చెందిన యహియా ఖురేషీ, వట్టిపల్లికి చెందిన మహ్మద్ మొయినొద్దీన్ అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. ఇందుకు సాక్షంగా తప్పుడు రికార్డులె సమర్పించారు. పిటిషనర్లు కోర్టుకు సమర్పించిన పహాణీలు, ఇంటి నంబర్లు, పన్ను చెల్లింపు రశీదులు సహా ఇతర రికార్డులన్నీ నకిలీగా తేలింది. విలువైన ఈ భూములు హెచ్‌ఎండీఏకే చెందుతాయని ఇటీవల కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు హెచ్‌ఎండీఏ అధికారులు ఆయా భూములను పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. అయితే రికార్డుల సెక్షన్‌లోని పహాణీలను ట్యాంప రింగ్ చేసి, అసలు పహాణీలకు నకలు సృష్టించి, కబ్జాదారులకు సహకరిండంపై ప్రభుత్వం అంతర్గత విచారణ చేపట్టింది. డబ్బులు తీసుకుని సహకరించిన వారి పేర్లను కబ్జాదారులు వెల్లడించినట్లు తెలిసింది.

ముగ్గురిపై వేటు.. మరో ముగ్గురికి నోటీసులు

వివాదాస్పద ఈ భూముల పహాణీలను మార్చి..హెచ్‌ఎండీఏను, ప్రభుత్వాన్ని ఏమార్చేందుకు అప్పటి సీనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం అబ్దుల్లాపూర్‌మెట్‌లో డిప్యూటీ తహసీల్దార్) రామకృష్ణ సహా అప్పటి వీఆర్‌ఏ (ప్రస్తుతం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్) రవి, జూనియర్ అసిస్టెంట్ అజయ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ యత్నించినట్లు విచారణలో తేలింది. వీరిలో రామకృష్ణ, రవి, అజయ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శశాంక ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు రికార్డులు సరిగా పరిశీలించకుండా, గత అధికారులు చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూ తప్పుడు రిపోర్టులు పంపిన ప్రస్తుత శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. హెచ్‌ఎండీఏ భూముల్లో వెలిసిన ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేసిన మున్సిపల్ అధికారుల్లోనూ అలజడి మొదలైంది. పీటీఐఎస్ నంబర్ల ఆధారంగా అక్రమార్కులు ఫిబ్రవరిలోనే పదికిపైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇందుకు సహకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిలోనూ ఆందోళన మొదలైంది.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా హనుమకొండ రంగస్వాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఇబ్రహీంపట్నం వాసవి జూనియర్ ఒకేషనల్ కళాశాల డీఆర్‌డీఏ స్కీమ్‌లో ఉన్న విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన విద్యార్థులను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడలు దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించే క్రీడా, సైన్స్, కల్చరల్ యాక్టివిటీస్‌లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వాసవి కళాశాల ప్రిన్స్‌పాల్ మంగులాల్, చైర్మన్ రమేష్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి, క్రీడకారులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళికి బంగారు బోనం



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో భక్తులు గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బంగారు పాత్రలోని నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజాభజంత్రీల మధ్య పోతురాజుల నృత్య విన్యాసాలతో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు. సికింద్రాబాద్ దేవాలయం వద్ద నార్త్ జోన్ డీసీపీ లక్ష్మీ పరిమళ కొబ్బరికాయ కొట్టి బంగారు బోనం ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సవరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు వర్తించని దరఖాస్తుదారులు తమ డేటా సవరణ కోసం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. సేవా కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ప్రజా పాలన సేవా కేంద్రంలో డేటా సవరణ చేసుకొని లబ్ధి పొందాలన్నారు. సేవా కేంద్రం ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు పని చేస్తుందన్నారు. సవరణ కోసం దరఖాస్తుదారులు రేషన్ కార్డ్, ఆధార్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ నంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ తేవాలని సూచించారు.

'ఆశల' సమస్యలు పరిష్కరించండి



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్లకు 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ (క్యాంపు కార్యాలయం) ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 వేల మంది ఆశా వర్కర్లు 19 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలోని గర్భిణులు, బాలింతలు, పేదలకు ఆరోగ్య భద్రత సేవలు అందిస్తున్నారని తెలిపారు. పారితోషికం కాకుండా ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ప్రమాద బీమా రూ.50 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆయా సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పరీక్ష రాసి వస్తా..
పైలం బిడ్డా!

నగరంలో గురువారం డీఎస్సీ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులతో ఆయా కేంద్రాలు సందడిగా కనిపించాయి. కొందరు మహిళలు తమ చిన్నారులను వెంట తీసుకు వచ్చారు. బయట ఉన్న తమ కుటుంబ సభ్యులకు పిల్లలను అప్పగించి పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. పరీక్ష వచ్చే వరకు అల్లరి చేయకుండా జాగ్రత్త ఉండాలని చిన్నారులను ఇలా బుజ్జగించి. సముదాయించిన చిత్రాలు డీఎస్సీ పరీక్ష కేంద్రాల వద్ద కనిపించాయి.





ప్రేమ పేరుతో బాలికపై అఘాయిత్యం

పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడు రాకేష్

మీర్‌పేట: ప్రేమ పేరుతో ఓ యువకుడు బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేటకు చెందిన రాకేష్ అలియాస్ రింకు(24) స్థానికంగా పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. సమీపంలో బిహార్ నుంచి ఓ కుటుంబం బతుకుదెరువు కోసం వచ్చి ఇక్కడే ఉంటుంది. రాకేష్, బాధిత బాలిక(15) కుటుంబాలు ఒకే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాయి. ఈ క్రమంలో రాకేష్ ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకొని కొంత కాలంగా లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురువారం బాలికను నిలదీయడంతో జరిగిన విషయం వెల్లడించింది. దీంతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాకేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

కేశంపేట: హత్య కేసులో నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమాన విధిస్తూ.. గురువారం న్యాయమూర్తి హరీష తీర్పు నిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తొమ్మిదిరేకుల గ్రామ శివారు నాన్యతండా శివారులో 2021లో భూ తగాదాలో వాడ్యావత్ భాస్కర్, బాదావత్ రమేష్ గొడవ పడ్డారు. ఈ తగాదాలో రమేష్ రోకలితో భాస్కర్ తలపై దాడి చేయగా, రమేష్ తల్లి హేమ్లీ అసభ్య పదజాలంతో దూషించింది. ఈ విషయమై అప్పట్లో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేశారు. గాయపడిన భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కేసును హత్యాయత్నం కేసుగా మార్చారు. షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీసులు కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి సకాలంలో కోర్టుకు సమర్పించారు. జిల్లా 9వ అడిషనల్ కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమాన, అసభ్య పదజాలంతో దూషించిన హేమ్లీకి రూ.2వేల జరిమాన విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు.

కన్నతండ్రే కామాంధుడై..

మేడిపల్లి: తాగిన మత్తులో కన్నతండ్రే కామాంధుడై కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి(36) కుటుంబంతోసహా బతుకుదెరువు కోసం నగరానికొచ్చి మేడిపల్లి సాయినగర్ కాలనీలో 15 ఏళ్లుగా ఉంటున్నాడు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలం క్రితం అతడిని భార్య వదిలి వెళ్లిపోగా, తల్లి, కూతురుతో కలిసి ఉంటున్నాడు. కుమార్తె(12)ను హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం కూతురికి జ్వరం రావడంతో ఇంటికి తీసుకువచ్చాడు ఇంట్లో తల్లిలేని సమయంలో బుధవారం అర్ధరాత్రి మద్యం మత్తులో కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఉచ్చు బిగించి.. బండరాయితో మోది


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- నిందితులు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్


హత్యకు గురైన పార్వతమ్మ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: అప్పు ఇవ్వలేదన్న అక్కసుతో ఒంటరి మహిళపై ఇద్దరు వ్యక్తులు కక్ష పెంచుకున్నారు. మద్యం తాగించి, మెడకు టవల్‌తో ఉచ్చు బిగించి ఊపిరాడకుండా చేశారు. ఆపై బండరాయితో మోది కర్కశంగా హత్యచేశారు. ఈ సంఘటన ఈ నెల 16న కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో చోటు చేసుకుంది. హత్యకేసు మిస్టరీ వీడిన నేపథ్యంలో గురువారం ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ రాజేష్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం బొదనంపల్లి గ్రామానికి చెందిన వెంకటపురం పార్వతమ్మ(45) భర్త అంజయ్య ఐదేళ్ల క్రితం చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో ఆమె గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మ, కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామానికి చెందిన యాదయ్యలతో పార్వతమ్మకు పరిచయం ఏర్పడింది. అది కాస్త యాదయ్యతో అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం పార్వతమ్మ.. తనకున్న వ్యవసాయ భూమిని విక్రయించి కందుకూరులో ఓ ఇంటిని కొనుగోలు చేసింది. బంగారు, వెండి ఆభరణాలు చేయించుకుంది. ఇది గమనించిన అంజమ్మ రూ.50వేలు అప్పు అడగగా.. అందుకు ఆమె నిరాకరించింది.

సాంకేతిక పరిజ్ఞానంతో..

హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడున్నర తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.1లక్షా 96వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించేందడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించి రివార్డు అందజేశారు. సమావేశంలో ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కృష్ణయ్య, రాజ్‌కుమార్, సిబ్బంది బిక్షపతి, వేణుగోపాల్, శివకుమార్, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

మద్యం తాగించి..

అప్పు ఇవ్వని పార్వతమ్మను అంతమొందించి, నగలు, నగదు అపహరించేందుకు అంజమ్మ, యాదయ్యలు కుట్రపన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న ఇద్దరు కలిసి పార్వతమ్మకు ఫోన్ చేసి, దావత్ చేసుకుందామని వేములనర్వకు పిలిపించారు. పథకం ప్రకారం ఆమెను గ్రామ శివారులోని లంబాయగుట్ట వేణుగోపాలస్వామి ఆలయ సమీపానికి అంజమ్మ తీసుకెళ్లగా.. వారి వెనకాలే యాదయ్య బైక్ పై మద్యం తీసుకొచ్చాడు. ముగ్గురు కలిసి మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న పార్వతమ్మ మెడకు టవల్‌తో ఊపిరాడకుండా చేశారు. బండరాయితో మోదీ హత్య చేశారు. మృతురాలి ఒంటిపై ఉన్న మూడున్నర తులాల బంగారు, రూ.50తులాల వెండి ఆభరణాలను తీసుకుని పరారయ్యారు. అపహరించిన సొత్తును షాద్‌నగర్ పట్టణంలోని బంగారు దుకాణంలో కుదవపెట్టి డబ్బులు తీసుకున్నారు.

బాలాజీ సన్నిధిలో నటుడు విశ్వక్ సేన్


ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న విశ్వక్ సేన్

మొయినాబాద్: ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు విశ్వక్ సేన్ గురువారం కలియుగ దైవం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సాధారణ భక్తులతో కలిసి ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విశ్వక్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ దుర్మరణం

పని ప్రదేశంలో వైరు సరిచేస్తుండగా ఘటన


నగేశ్ మృతదేహం

చేవెళ్ల: విద్యుదాఘాతంలో ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన ఉమ్మెంతల నగేశ్(40) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ స్థానికంగా రంగారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు రోజులుగా భగత్‌సింగ్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో విద్యుత్ పనులను ఆయన చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వైర్ సరి చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి నగేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి చేవెళ్ల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కారు ఢీకొని.. బాలుడికి గాయాలు

మొయినాబాద్: ఇంటి ముందు ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగింది. ఈ సంఘటన మండల పరిధి హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన నరేష్ కుమారుడు నిక్షిత్(2) గురువారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న తమ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు.. బాలున్ని ఢీకొట్టింది. దీంతో అతడి కాలు విరిగింది. బాలున్ని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఘటన అనంతరం డ్రైవర్ కారు ఆపకుండా పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీ డాడీ పిలుస్తున్నాడంటూ..

ఎనిమిదేళ్ల చిన్నారి అపహరణ


కాజల్‌సింగ్(ఫైల్)

కొత్తూరు: స్నేహితులతో కలిసి ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని ఓ గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజయ్‌సింగ్, సుమిత్ర భార్యాభర్తలు. వీరికి ఎనిమిదేళ్ల పాప కాజల్‌సింగ్, ఐదేళ్ల వయసున్న కొడుకు ఉన్నారు. రెండేళ్ల క్రితం ఉపాధి కోసం కొత్తూరుకు వచ్చారు. బాలిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు తాము అద్దెకు ఉంటున్న ఇంటి ఆవరణలో స్నేహితులతో కలిసి ఆడుకుంటోంది. ఈ సమయంలో బైకుపై వచ్చిన ఓ అపరిచిత వ్యక్తి చిన్నారితో మాటలు కలిపాడు. మీ డాడీ పిలుస్తున్నాడంటూ బాలికను వెంట తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని ఇతర పిల్లలు తల్లికి చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన ఆమె.. స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో అక్కడకు చేరుకున్న సీఐ నర్సింహరావు పాప ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. పాప ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ బిల్లు చెల్లించాలన్న సిబ్బందిపై దాడి


దాడిలో గాయపడ్డ సాయిగణేశ్

సనత్‌నగర్: విద్యుత్ బిల్లు చెల్లించాలని అడిగిన సిబ్బందిపై ఓ యువకుడు దాడి చేశాడు ఓ యువకుడు. అతడిపై చర్యలు తీసుకోవాలంటూ విద్యుత్ ఉద్యోగులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు శాంతినగర్‌కు చెందిన హమీన్‌పూర్ శ్రీకాంత్(45) ఎర్రగడ్డ ప్రాంతంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ప్రైవేటు మీటర్ రీడర్ అయిన సాయిగణేష్‌తో కలిసి మోతీనగర్ మీ-సేవా సమీపంలో ఉన్న వెంకటస్వామి ఇంటికి వెళ్లి రూ.6,858 కరెంటు బిల్లు చెల్లించాలని కోరారు. దీంతో వెంకటస్వామి కుమారుడు మురళీధర్‌రావు కలగజేసుకుని 'మేం బిల్లు కట్టం.. ఏమి చేసుకుంటారో చేసుకోండి' అంటూ దురుసుగా మాట్లాడాడు. శ్రీకాంత్‌పై దాడి చేసి కిందికి నెట్టేశాడు. సాయిగణేష్ మొహంపై, కడుపులో పిడిగుద్దులతో దాడి చేశాడు. దీంతో సాయిగణేష్ కుడికన్నుకు గాయాలయ్యాయి. శ్రీకాంత్ శరీరం కమిలిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మురళీధర్‌రావుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మురళీధర్‌రావు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండటం గమనార్హం. అలాగే అతడికి బాక్సింగ్‌లో కూడా ప్రావీణ్యం ఉంది.

'చిరెక్' విద్యార్థుల సత్తా

సాక్షి, సిటీబ్యూరో: చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల ఐబీడీపీ, కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, సీబీఎస్ఈ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ స్కూల్ అంతర్జాతీయ విభాగం ప్రిన్సిపాల్ సంచిత రాహా తెలిపారు. 'ఐబీడీపీ మే 2024'పరీక్షలో 95 మంది విద్యార్థులు ఈ ఏడాది సగటు 34 స్కోర్‌ను సాధించిందని, ఇది అంతర్జాతీయ సగటు 30.32 కన్నా ఎక్కువని పేర్కొన్నారు. ముఖ్యంగా 15 మంది విద్యార్థులు 40 గ్రేడ్ పాయింట్లకుపైగా సాధించారని, స్పృహ డియో, ఆమని సుసానా మద్దుకూరి 45కి 44 పాయింట్లు సాధించారన్నారు. కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ 2024 పరీక్షల్లో 186 ఏ ప్లస్, 183 ఏ ఎంట్రీలతో అన్ని సబ్జెక్టుల్లో స్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. సన్వారియా 96.8 శాతం స్కోర్ సాధించగా, 86.7 శాతం మంది విద్యార్థులు 75 శాతం, అంతకంటే ఎక్కువ సాధించారన్నారు.

22న షార్జా-అసోచామ్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: షార్జా ప్రభుత్వంతో కలిసి నగరానికి చెందిన అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ - ఇండస్ట్రీ సహకారంతో ప్రత్యేక బీ2బీ సమావేశాన్ని ఈ నెల 22న బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని అసోచామ్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార ప్రోత్సాహకాలు, సున్నా పన్నులు, వేగంగా కంపెనీ రిజిస్ట్రేషన్ మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, రష్యా, ఐరోపాలో వ్యూహాత్మక మార్కెట్ చేరుకోవడం వంటి లక్ష్యాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలలో అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా వారి వ్యాపారాలను విస్తరించడానికి ఈ భేటీ ఉపకరిస్తుందన్నారు.

ఉమ్మడి దేవాలయాల కమిటీలకు చెక్కులు


చెక్కుల పంపిణీలో మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రజల భాగస్వామ్యం, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాల ఉమ్మడి దేవాలయాలకు మంత్రి చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాలయ కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న ఉజ్జయిని మహంకాళి బోనాలు, 28న లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు, ఆ తర్వాత రంగం, భవిష్యవాణి, ఏనుగు ద్వారా అంబారీ ఊరేగింపు కార్యక్రమాలు సజావుగా జరగాలని మంత్రి ఆకాంక్షించారు. గతేడాది కంటే ఈసారి దేవాలయాలకు 10 శాతం అదనంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో చెక్కుల పంపిణీ పూర్తైందన్నారు.

రోడ్డు ప్రమాదాలపై 'ఆప్ట్'

- పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ విభాగాలతో ప్రత్యేక బృందాలు
- ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యలు సూచించడం వీటి బాధ్యత
- ఇక గల్లీగల్లీలో సైకిల్ పెట్రోలింగ్.. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత
- ప్రజలతో సత్సంబంధాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన
- నైపుణ్యతను బట్టి హెడ్ కానిస్టేబుళ్లకూ ఐఓ బాధ్యతలు


'సాక్షి'ఇంటర్వ్యూలో రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాల నివారణపై రాచకొండ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యల కోసం యాక్సిడెంట్ అనాలసిస్ ప్రివెన్షన్ టీం(ఆప్ట్) ఏర్పాటు కానుంది. ఇందులో పోలీసులతో పాటు మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ, ఇంజనీరింగ్ వంటి అన్ని విభాగాలు భాగస్వామ్యం అవుతాయి. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే కేసు నమోదు, దర్యాప్తుతోపాటు సమాంతరంగా ప్రమాదం జరిగిన తీరు, కారణాలు, రోడ్డు పరిస్థితులు తదితరాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించడం, పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నివారణ మార్గాలను సూచించడం ఈ బృందం బాధ్యత. రోడ్లపై పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధ్యయనం చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో రహదారుల వెడల్పు, ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు ఇతరత్రా చర్యలూ తీసుకుంటుంది. ఈ మేరకు 'ఆప్ట్'ను రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో త్వరలోనే అమలు చేయనున్నట్లు కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. 'సాక్షి'ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించిన ముఖ్యమైన అంశాలివీ..

ఈ మూడింటికే ప్రాధాన్యత..

రాచకొండలో విజుబుల్ పోలీసింగ్, సత్వర స్పందన, సాంకేతికత వినియోగం.. ఈ మూడింటికే అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పోలీసు వ్యవస్థలో సాంకేతికత వినియోగం ఎంత పెరిగినా విజుబుల్ పోలీసింగే అత్యంత కీలకం. అందుకే గల్లీ గల్లీలో సైకిల్ పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే ప్రతీ పోలీసుస్టేషన్‌కు 3-4 సైకిళ్లను పంపిణీ చేశాం. శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ఠాణా సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సైకిళ్లపై తిరుగుతారు. దీంతో సిబ్బందికి ఆరోగ్యం, ప్రజలతో సత్సంబంధాలు మెరుగవుతాయి. వీరు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నేరం జరగ్గానే సత్వరమే స్పందించి ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి బాధితులకు న్యాయం చేయాలి. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులపై జరిగే అత్యాచారాలు, హత్యలు ఇతరత్రా నేరాలను చాలెంజ్‌గా తీసుకొని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

హెడ్ కానిస్టేబుళ్లు ఐఓలుగా..

నేరం తీవ్రత, సిబ్బంది పనితీరు, నైపుణ్యతను బట్టి హెడ్ కానిస్టేబుళ్లకు కూడా విచారణాధికారి(ఐఓ) బాధ్యతలు అప్పగిస్తాం. దీంతో వారు సుశిక్షితులు అవడంతోపాటు ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్లపై ఒత్తిడి తగ్గుతుంది. డ్రగ్ పెడ్లర్, భూకబ్జాదారులపై ఉక్కు పాదం మోపుతాం. సామాన్యులను ఏమాత్రం ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించం. హత్యలు, దొంగతనాల తరహాలోనే భూ కబ్జాదారులపై పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తాం. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంతోపాటు వాటి మూలాలను వెతికి పట్టుకొని కూకటివేళ్లతోసహా పెకిలిస్తాం. దీనికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ఒక్క కన్విక్షన్.. వంద నేరాలకు అడ్డు

ఒక్క నేర నిరూపణ(కన్విక్షన్) వంద నేరాలకు అడ్డుకట్ట పడుతుంది. నేరం చేస్తే పోలీసుల నుంచి, శిక్ష నుంచి తప్పించుకోలేమనే భయం నేరస్తులలో కలుగుతుంది. ఇదే లక్ష్యంగా ఎక్కువ కన్విక్షన్లు వచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. కేసు నమోదైన 60 రోజుల్లోగా చార్జ్‌షీట్లు దాఖలు చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. రౌడీషీటర్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న పాత నేరస్తుల గురించి ఆరా తీసి, వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారు? ఫోన్ నంబర్లు, చిరునామా, కుటుంబసభ్యులు, ఇతరత్రా వివరాలతో డేటా అప్‌డేట్ చేస్తాం. దీంతో వారి కదలికలపై నిరంతరం నిఘా పెట్టడానికి వీలవుతుంది.

కమిటీలు క్రియాశీలంగా..

మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లు, కాలేజీలలో సైబర్ వారియర్లు, యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్ కమిటీలు క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మీద ఉంటేనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ జరుగుతుంది. అందుకే ఇక నుంచి ప్రతిరోజు పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ డీసీపీ నుంచి కానిస్టేబుల్ వరకూ ప్రతీ ఒక్కరూ రోడ్డు మీదనే విధులు నిర్వర్తిస్తారు.